## పశ్చిమ గోదావరి జిల్లాలో '1 ఆఫ్ 70' సమస్య :

# గిరిజన - గిరిజనేతర ఘర్షణలు

మన రాష్ట్రంలో ఈ రోజు వేడిగా చర్చ జరుగుతున్న విషయాలలో '1 ఆఫ్ 70' ఒకటి. అడవులు, ఆదివాసీలు లేని జిల్లాలలో దీని గురించి తెలియక పోవచ్చుగానీ ఏజెన్సీ లేక షెడ్యూల్డు ప్రాంతం ఉన్న జిల్లాలలో ఈ సమస్య గురించి ఒక అభిప్రాయం లేని వాళ్లెవరూ ఉండరు. '1 ఆఫ్ 70' పేరిట గిరిజనేతరులలో పేద వాళ్లను కూడా తరిమేయడం అన్యాయం' అనేది మైదాన ప్రాంతాలలో సర్వత్రా వినపడే ఆవేశ పూర్వకమైన అభిప్రాయం. ఆదివాసీలు గిరిజనేతర పేదలకు అనుకూలంగా గానీ వ్యతిరేకంగా గానీ ఆవేశపడరు. తమ సమస్య గురించి మాత్రమే వాళ్లు మాట్లాడతారు. '1 ఆఫ్ 70' వల్ల తమకు జరిగింది కొంచెమే అయినా అది కూడ నీరు కారిపోతే తమకు దిక్కుండదని ఆవేదన చెందుతారు. మండల్ కమిషన్ గురించి చర్చ వచ్చినప్పుడు 'అగ్ర కులాలలోని పేద వాళ్ల సంగతేమిటి? అని చాలా మంది ఆవేశ పడ్డారు. 1 ఆఫ్ 70 గురించి మాట్లాడితే 'గిరిజనేతరులలోని పేద రైతుల మాటేమిటి?' అంటారు. అగ్రకులాలలోని పేదల నిరుద్యోగ సమస్య పట్ల, గిరిజనేతర పేదరైతుల జీవన సమస్యపట్ల ప్రజా తంత్ర వాదులందరికీ సానుభూతి ఉంటుంది. కానీ సమస్య పైన చర్చ మొదలు పెట్టవలసింది అక్కడ కాదు. రిజర్వేషన్ సమస్యపైన చర్చ మొదలు పెట్టవలసింది పీడిత కులాల హక్కుల దగ్గర. '1 ఆఫ్ 70' గురించి చర్చ మొదలు పెట్టవలసింది ఆదివాసీల భూమి సమస్య దగ్గర. మొత్తం సమస్యను చర్చించిన తరువాత దానికి అనుబంధంగా అగ్రకులాల పేదల నిరుద్యోగం సమస్య, గిరిజనేతర పేద రైతుల జీవనం సమస్య చర్చకు వస్తాయి. అంతే తప్ప చర్చ మొదలు పెట్టవలసింది వాళ్ల దగ్గర కాదు.

*1 ఆఫ్ 70 గురించి మాట్లాడితే 'గిరిజనేతరులలోని పేద రైతుల మాటేమిటి?' అంటారు. అగ్రకులాలలోని పేదల నిరుద్యోగ సమస్య పట్ల, గిరిజనేతర పేదరైతుల జీవన సమస్యపట్ల ప్రజాతంత్ర వాదులందరికీ సానుభూతి ఉంటుంది. కానీ సమస్య పైన చర్చ మొదలు పెట్టవలసింది అక్కడ కాదు. రిజర్వేషన్ సమస్యపైన చర్చ మొదలు పెట్టవలసింది పీడిత కులాల హక్కుల దగ్గర. '1 ఆఫ్ 70' గురించి చర్చ మొదలు పెట్టవలసింది ఆదివాసీల భూమి సమస్య దగ్గర. మొత్తం సమస్యను చర్చించిన తరువాత దానికి అనుబంధంగా అగ్రకులాల పేదల నిరుద్యోగం సమస్య, గిరిజనేతర పేద రైతుల జీవనం సమస్య చర్చకు వస్తాయి.*

గడిచిన కొన్ని నెలలుగా పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకూ గిరిజనేతరులకూ ఘర్షణలు జరుగుతున్నాయి. చాలా మంది గిరిజనులు క్రిమినల్ కేసులలో అరెస్టయ్యారు. ఒక్క ఊరిలో గిరిజనేతరులు కూడా అరెస్టయ్యారు. రెండు ఎం ఆర్ వో ఆఫీసులు గిరిజనేతరుల ఆగ్రహానికి బుగ్గి అయ్యాయి. గిరిజనేతరుల ధర్నాలు, ఉద్యమ హెచ్చరికలు వార్తలకెక్కాయి.

ఈ గొడవల వివరాలనూ, నేపథ్యాన్నీ పరిశీలిస్తే '1 ఆఫ్ 70' గురించి కొంచెం అర్థం అవుతుంది. '1 ఆఫ్ 70'గా ప్రచారమయినది ఒక శాసనం. ఇంకా సరిగ్గా చెప్పాలంటే అది ఒక శాసన సవరణ. దాని పూర్తి పేరు 'రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970'. ఈ చట్టం 1970 లో జారీ అయింది. ఇది ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టాన్ని (ఎపి ఎస్ ఏ ఎల్ టి ఆర్ చట్టాన్ని ) సవరించే రెగ్యులేషన్. 'షెడ్యూల్డు ప్రాంతాలు' అంటే అడవి ప్రాంతాలలో గిరిజనుల సంక్షేమం కోసం వర్గీకరించబడిన ప్రాంతాలు. వీటినే బ్రిటిష్ హయాంలో 'ఏజెన్సీ ప్రాంతాలు' అనే వాళ్లు. ఇప్పటికీ వ్యవహారంలో 'ఏజెన్సీ' అనే అంటుంటారు. 1917 లో బ్రిటిష్ వాళ్లు అప్పటి మద్రాసు రాష్ట్రంలోని ప్రస్తుత ఉత్తరకోస్తా ఆంధ్ర జిల్లాల ఏజెన్సీ ప్రాంతంలో భూమి బదలాయింపును, వడ్డీ వ్యాపారాన్ని నియంత్రించే చట్టం చేసారు. ఏజెన్సీ ప్రాంతాలలో కలెక్టర్ ('ఏజెంట్') అనుమతి లేకుండ గిరిజనుల నుండి గిరిజనేతరులకు భూమి బదలాయింపు జరగడానికి వీలులేదనేది 1917 నాటి ఏజెన్సీ చట్టం సారాంశం. మైదాన ప్రాంతాల వాళ్లు అడవులలోకి పోయి ఒక శేరు ఉప్పు, లేకపోతే ఒక కట్ట పొగాకు ఇచ్చి ఎకరాలకు ఎకరాలు గిరిజనుల భూమిని స్వాధీనం చేసుకొనేవారు లేదా దౌర్జన్యంగా ఆక్రమించుకునేవారు. కౌలుకని చెప్పి తీసుకొని స్వంతం చేసుకునేవారు. ఈ దురాక్రమణను ఆపడం కోసమని చెప్పి కలెక్టర్ అనుమతి లేకుండ గిరిజనుల భూమి గిరిజనేతరులకు బదలాయింపు కావడానికి వీలు లేదని చట్టం చేసింది ప్రభుత్వం.

దీనివల్ల ఏమేరకు బదలాయింపు ఆగిందో చెప్పడం కష్టం. కరణాలను పట్టుకొని లేని రికార్డు సృష్టించి భూమి స్వంతం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూమిని పోరంబోకు భూమిగా రాయించి తాము పట్టా వేసుకోవచ్చును లేదా ఎప్పటి నుండో అది గిరిజనేతరుల భూమేనని రాయించుకోవచ్చును. కలెక్టర్ అనుమతి 'మేనేజ్' చేసుకొనవచ్చును.

ఏమయితేనేం, ఆంధ్ర ప్రాంతపు ఆదివాసీలకు ఒక సంరక్షణ చట్టం వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1956లో ఏర్పడిన తరువాత దానిని కొంచెం సవరించి 1959లో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టం (ఎపి ఎస్ ఏ ఎల్ టి ఆర్ చట్టం) తయారు చేసారు. దీని క్రింద షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజనేతరుల నుండి గిరిజనులకు ఎట్టి పరిస్థితిలోనూ భూమి బదలాయింపు జరగడానికి వీలులేదు. ఇందులో కలెక్టర్ అనుమతి ప్రసక్తిలేదు. 1963 నుండి ఈ

చట్టాన్ని తెలంగాణా జిల్లాలలోని షెడ్యూల్డు ప్రాంతాలకు కూడా వర్తింప జేసారు. ఈ చట్టం వల్ల ఆ తరువాత నయినా భూమి బదలాయింపు ఏ మేరకు ఆగిందని అడిగిన వాళ్లు లేరు. నిజానికి శ్రీ కాకుళ గిరిజన తిరుగుబాటు దాకా రాష్ట్రంలో గిరిజనుల యోగక్షేమాలు కనుక్కున్న వాళ్లు లేరు. ఆ తరువాత మాత్రం ఆదివాసీల మంచి చెడుల గురించి చర్చ, కొత్త చట్టాలు, కొత్త సంస్థలు వచ్చాయి. వాటిలో ఒకటి రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970, లేక '1 ఆఫ్ 70'. ఇది 1959 నాటి చట్టాన్ని సవరించి రెండు మార్పులను ప్రవేశ పెట్టింది. ఒకటి, ఇక మీదట షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజనుల నుండి గిరిజనేతరులకు జరిగే బదలాయింపులే కాదు, గిరిజనేతరుల నుండి గిరిజనేతరులకు జరిగే బదలాయింపులు కూడ చెల్లవు. రెండు, షెడ్యూల్డు ప్రాంతాలలో భూమి కలిగి ఉన్న గిరిజనేతరులు ఆ భూమిని తాము అక్రమంగా సంపాదించు కోలేదని తామే రుజువు చేసుకోవాలి. అంతవరకు అది గిరిజనుల భూమిగా భావించబడుతుంది. అంటే 'రుజువు చేసుకునే బాధ్యత' (బర్డెన్ ఆఫ్ ప్రూఫ్) గిరిజనేతరుల మీదనే ఉంటుంది.

ఇది నిజానికి గట్టి సవరణే. దీని ఫలితంగా, గిరిజనుల నుండి ఫిర్యాదు లేకుండ సంబంధిత ప్రభుత్వ అధికారే షెడ్యూల్డు ప్రాంతాలలో భూమి ఉన్న గిరిజనేతరులందరికీ నోటీస్ జారీ చేయవచ్చును. 'నీ భూమి అక్రమంగా సంపాదించుకున్నది కాదని రుజువు చేసుకొమ్మని' అడగ వచ్చును. సమాధానం సంతృప్తికరంగా లేకపోతే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమి లేని గిరిజనులకు ఇయ్యవచ్చును.

ఇంత అధికారం ప్రభుత్వం చేతిలో పెట్టినా గిరిజనులకు జరిగిన న్యాయం స్వల్పమే. ప్రభుత్వం లెక్కల ప్రకారం రాష్ట్రం మొత్తం మీద 'ప్రాథమికంగా అనుమానాస్పదంగా' ఉన్న ఏజెన్సీ భూములలో దాదాపు 85 శాతం భూములకు సంబంధించి ఇప్పటికే వాటి యజమానులయిన గిరిజనేతరులకు నోటీసులు ఇవ్వడం, విచారించడం జరిగి పోయింది. నీటి మొత్తం విస్తీర్ణం 2,17,574 ఎకరాలు. అందులో 99,087 ఎకరాలు (అంటే 46 శాతం) అక్రమంగా గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్నాయని నిర్ధారించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జరిగింది. మిగిలిన 1,18,486 ఎకరాలు (అంటే 54 శాతం) సక్రమంగానే గిరిజనేతరుల స్వాధీనంలో ఉన్నాయని భావించి వాళ్లకే పట్టాలు ఇవ్వడం జరిగింది. ఇంకొక రకంగా చెప్పాలంటే 'ప్రాథమికంగా అనుమానాస్పదం' అనిపించిన దానిలో ఎక్కువ భాగం సక్రమంగానే గిరిజనేతరుల అధీనంలో ఉందని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంక విచారించడానికి మిగిలింది 15 శాతం కేసులు మాత్రమే. వాటిలో ఇమిడి ఉన్న భూమి 7653 ఎకరాలు మాత్రమే. నీటి విచారణ కూడ ముగించేస్తే న్యాయం జరిగిపోయినట్టే.

ఇంక సమస్య ఏం మిగిలింది? న్యాయం జరిగి పోయిందని ఆదివాసీలు కూడా ఒప్పుకుంటే ఇంక సమస్య ఏమీ లేనట్టే. కానీ ఆదివాసీలు ఒప్పుకోవడం లేదు. వాళ్లు ఇప్పుడిప్పుడే మేల్కొంటున్నారు. తమ హక్కులు తెలుసుకుంటున్నారు. కొన్ని చోట్ల సిపిఐ (ఎం.ఎల్) పార్టీల రైతుకూలీ సంఘాలు, కొన్ని చోట్ల స్వచ్ఛంద సంస్థలు, కొన్ని చోట్ల చదువుకొని తిరిగొచ్చిన గిరిజన యువకులు ఈ మేల్కొలుపుకు కారణం అయ్యారు. విచారణ జరిగి పోయిందనీ సక్రమంగానే గిరిజనేతరుల ఆక్రమణలో ఉందనీ ప్రభుత్వం ప్రకటించిన భూముల గురించి కూడ వాళ్లు వివాదం లేవనెత్తుతున్నారు. ఇంక విచారణ జరగవలసి ఉన్నది రాష్ట్రం మొత్తం మీద 7వేల చిల్లర ఎకరాల ఏజెన్సీ భూముల గురించేనని ప్రభుత్వం అంటుంటే, గిరిజనులు ఒక్కొక్క ఏజెన్సీ మండలంలోనూ 7 వేల ఎకరాల భూమి గురించి వివాదం లేవదీస్తున్నారు. ప్రభుత్వ విచారణ అధికార్లు ఏజెన్సీ భూములపైన విచారణ జరిపే పద్ధతులను ప్రశ్నిస్తున్నారు. విచారణ అధికార్లు ఆమోద ముద్ర వేసిన డాక్యుమెంట్ల విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నారు. కరణాలు, మునసబులు, తాసీల్దార్లు గిరిజనేతరుల ఆక్రమణను చట్టబద్ధం చేయడానికి పాల్పడిన అక్రమాలను ప్రశ్నిస్తున్నారు. దీనితో '1 ఆఫ్ 70' సమస్య రచ్చ కెక్కింది.

ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ మధ్య తలెత్తిన వివాదాలను పరిశీలిద్దాం. పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీకి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. తూర్పు గోదావరి నుండి శ్రీకాకుళం దాకా ఉన్న ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా కొండలు నిండిన ప్రదేశంలో ఉంది. మైదాన ప్రాంతాల వాళ్ల చొరబాటుకు అంతగా అవకాశం ఇవ్వని భూభాగం ఆ జిల్లాల ఏజెన్సీలో చాలా ఉంది. ఇది గిరిజనేతరుల ఆక్రమణను కొంత మేరకు పరిమితం చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ పూర్తిగా మైదాన ప్రాంతాలకు అందుబాట్లో ఉంది. అది కొండ ప్రాంతం కాదు, దట్టమైన అడవి కాదు. గిరిజనేతరులు సులభంగా చొరబడి భూములు ఆక్రమించుకో గలిగారు.

పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో మూడు మండలాలున్నాయి. జీలుగుమిల్లి, బుట్టాయ గూడెం, పోలవరం. ఈ మూడు మండలాలూ ఒక దానినొకటి ఆనుకొని ఉన్నాయి. ఈ సంవత్సరం మేనెల నుండి ఈ మూడు మండలాలూ గిరిజన - గిరిజనేతర ఘర్షణతో అట్టుడికి పోతున్నాయి. ఈ ఘర్షణల కథలు క్లుప్తంగా చెప్పుకుంటే గిరిజనులు లేవనెత్తుతున్న భూమి సమస్య అర్థం అవుతుంది. అప్పుడు '1 ఆఫ్ 70' ని రద్దు చేయడం, లేక సవరించడం కాదుసరికదా, దాని కంటె బలమైన చట్టాలు రూపొందిస్తే తప్ప ఆదివాసీల భూమి సమస్య పరిష్కారం కాదని మనకు అర్థం అవుతుంది. ఈ మూడు మండలాలలోని ఏజెన్సీ భూములలో అధికార లెక్కల ప్రకారమే సగం కంటె ఎక్కువ గిరిజనేతరుల చేతిలో ఉంది. బేనామీ ఆక్రమణలను, తప్పుడు లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే 70 శాతం పైగా భూమి గిరిజనేతరుల అధీనంలో ఉంటుంది. అందులో కొంత మంది చాలా పెద్ద భూస్వాములున్నారు. చాలామంది మధ్య తరగతి, చిన్న రైతులున్నారు. పెద్దవారైనా చిన్న వారైనా గిరిజనేతరులకు ఏజెన్సీ బయట జీవనాధారం దొరుకుతుంది. గిరిజనులకు ఆ అవకాశం లేదు కాబట్టి ఏజెన్సీ భూములు ఇంత పెద్ద మొత్తంలో మైదాన ప్రాంతాల వారి అధీనంలో ఉంటే అడవి తప్ప వేరే దిక్కులేని ఆదివాసీల మనుగడే సమస్య అవుతుంది.

జీలుగుమిల్లి మండలంలోని దర్భగూడెం ఒక గిరిజనేతర గ్రామం. రాజమండ్రి - ఖమ్మం రహదారి మీద ఉంది. ఈ గ్రామం శివారులోని గిరిజన గూడాలలో కోయదొరల గూడెమయిన పండువారి గూడెం ఒకటి. 30 ఇళ్లున్న ఈ గూడెంలో 'పండు' అన్న ఇంటిపేరున్న వారికి తప్ప వేరే ఎవ్వరికీ ఎక్కువ భూమిలేదు. చాలా కాలం తమ హక్కుల గురించి కొట్లాడాలన్న స్పృహలేని ఈ కోయలు ఈ మధ్య కాలంలో 'శక్తి' అనే స్వచ్ఛంద సంస్థ ప్రోత్సాహంతో దర్భగూడెంకు చెందిన కోమటి, రెడ్డి తదితర

అగ్రకులాల గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న భూముల పూర్వాపరాలను గురించి ఆరాతీయడం, ఆందోళన చేయడం మొదలు పెట్టారు. ఈ గిరిజనేతరులలో పెద్దకామందులు కొనకళ్ల నాగయ్య అనే కోమటాయన సంతతి. ఈ నాగయ్యకు ఒకప్పుడు 1200 ఎకరాలు ఉండేవట. పంపకాలు, అమ్మకాలు పోను ఇప్పుడు ఆ కుటుంబానికి 141 ఎకరాలున్నాయి. ఏజెన్సీకి వర్తించే సీలింగ్ పరిమితి 40 ఎకరాలు కాబట్టి కుటుంబంలో ఏ ఒక్కరి పేరు మీదా 40 కంటె ఎక్కువ చూపించకుండ జాగ్రత్త పడతారు. ఈ ఒక్క ఊరిలోనే కాదు, ఏజెన్సీ గ్రామాలలోని సంపన్నులైన గిరిజనేతరులను నీకెంత భూమి ఉంది అని అడిగితే ఎక్కువ మంది '40 ఎకరాలు' అనే సమాధానం చెప్తారు. ఇందులో ఉన్న బేనామీ వ్యవహారాన్ని పక్కకు పెట్టి, పశ్చిమ గోదావరి ఏజెన్సీలోని భూమి అత్యంత సారవంతమైనదని గమనిస్తే ఈ 40 ఎకరాల సీలింగ్ చాలా ఎక్కువ అని గుర్తించగలం. 'అది లెక్కకు మెట్టభూమి కిందికి రావడం వల్ల సీలింగ్ అంత ఎక్కువ ఉందిగానీ భూసారాన్ని బట్టి, ఫలాన్ని బట్టి చూస్తే సీలింగ్ అందులో సగానికి తగ్గించవచ్చు' అని ఒక సీనియర్ రెవెన్యూ అధికారి స్వయంగా పౌరహక్కుల సంఘంతో అన్నారు. ఆదివాసీల భూమిదాహాన్ని తీర్చడానికి ఇదొక మంచి సూచన కావచ్చు.

అదెట్లా ఉంచి, దర్భగూడెంలోని '1 ఆఫ్ 70' సమస్యకు తిరిగి వద్దాం. పండువారి గూడెం కోయలు ఈ మధ్య దర్భగూడెం గిరిజనేతరులు సాగు చేస్తున్న భూమిలో 495 ఎకరాల గురించి వివాదం లేవదీసారు. 1917 చట్టం వచ్చిన తరువాత జరిగిన మొదటి సర్వే అండ్ సెటిల్‌మెంట్ (ఆర్ ఎస్ ఆర్) 1933 నాటిది. కాబట్టి 1933 ఆర్ ఎస్ ఆర్ లో భూమి ఎవరి పేరు మీద ఉందనేది ఈనాటి '1 ఆఫ్ 70' విచారణలలో ఒక ముఖ్య సాక్ష్యాధారం అయింది. అందులో గిరిజనేతరుల పేరు మీద ఉన్నట్టయితే, ఇప్పటి వాళ్ల యాజమాన్యం సక్రమమయినదిగా రుజువయినట్టేనని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. 1933 సెటిల్‌మెంట్‌లోనే ఏవయినా అక్రమాలు జరిగి ఉండ వచ్చునేమో అన్న చర్చలోకి వాళ్లు పోవడం లేదు. దర్భగూడెం గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న భూములన్నీ 1933 ఆర్ ఎస్ ఆర్ లో వారి పేరు మీదనే ఉన్నాయి కాబట్టి '1 ఆఫ్ 70' పరిధిలో వారి యాజమాన్యం సక్రమమయినదేనని అధికారులు (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) తీర్పు ఇచ్చారు. కానీ గిరిజనులు ఈ మధ్య 1903 నాటి సెటిల్‌మెంట్ రికార్డు బయటకు తీసారు. దాని ప్రకారం ఈ భూమిలో 495 ఎకరాలు గిరిజనుల పట్టాభూమి అని వాదించారు. 495 కాదుగానీ, 302 ఎకరాలు (32 సర్వేనంబర్లలో) 1903లో గిరిజనుల పేరు మీద ఉండి 1933 నాటికి ఇద్దరే ఇద్దరు గిరిజనేతరుల పేరు మీద (కొనకళ్ల నాగయ్య, రేపాక గురవయ్య) ఆర్ ఎస్ ఆర్ లోకి ఎక్కాయని గ్రామ వి.ఎ.ఓ కూడ ఒప్పుకుంటున్నారు. ఈ బదలాయింపు ఎప్పుడు జరిగింది? 1917కు ముందా? ఆ తరువాతనా? ఆ తరువాతయితే కలెక్టర్ అనుమతితో జరిగిందా? ఎప్పుడు జరిగిందన్న ప్రశ్నే కాక ఏ విధంగా జరిగిందన్న ప్రశ్న కూడ వేసుకోవాలి. తగిన ధర ఇచ్చి కొన్నారా? కొంచెం ఉప్పు, కారం, చింతపండు ఇచ్చి స్వాధీనం చేసుకొన్నారా? అసలు ఏమీ ఇవ్వకుండా దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొన్నారా? ఈ ప్రశ్నలకు ఏ విధంగా జవాబు వెతకాలి? 70 ఏళ్ల వెనక చరిత్రను ఎవరు తవ్వి బయటకు తీయాలి? 1903 నాటి సెటిల్‌మెంట్ రికార్డును గిరిజన సంఘాల కార్యకర్తలు తవ్వి బయటికి తీసారు కాబట్టి ఈ వివాదమైనా వెలుగు చూసింది. గిరిజనులు ఎప్పటిలాగే అజ్ఞానంలోనే ఉండి పోతే 1933 ఆర్ ఎస్ ఆర్ లో ఏముంటే అదే తుది సత్యం అని భావించి నిర్ధారణ చేస్తున్న రెవెన్యూ అధికారుల తీర్పులే నిలిచి పోయేవి కదా?

1 ఆఫ్ 70 ప్రకారం 'బర్డెన్ ఆఫ్ ప్రూఫ్' గిరిజనేతరులపైన ఉంటుంది. కాబట్టి ఏజెన్సీ అధికారులు ఒక్కొక్క గిరిజనేతరుడికీ నోటీసు ఇచ్చి విచారణలు జరుపుతున్నారు, బాగానే ఉంది. కానీ అదే గ్రామంలో నివసించే గిరిజనులకు కూడ నోటీసు ఇచ్చి వారిని కూడా విచారణలో భాగం చేయరు (గిరిజనుల ఫిర్యాదు మీద చేపట్టిన కేసయితే తప్ప). అంటే వ్యాజ్యం మొత్తం ప్రభుత్వానికీ గిరిజనేతరులకూ మధ్య నడుస్తుంది. గిరిజనేతరులు చూపించే కాగితాల వెనకున్న వాస్తవాలేమిటో చెప్పగలిగింది స్థానిక గిరిజనులే. అయినా వారికి విచారణలో చోటు లేదు. ఒక వేళ చోటు కలిగించినా, వారి మౌఖిక సాక్ష్యానికి అస్పష్టమైన జ్ఞాపకాలకూ ఏజెన్సీ కోర్టుల దృష్టిలో విలువ లేదు. గిరిజనేతరులు ముందు పెట్టే కాగితపు సాక్ష్యాలకు జవాబుగా కాగితపు ఆధారాలనే చూపించాలి. కానీ గిరిజనులకు అవి అందుబాట్లో ఉండవు. ఈ తరంలో వాళ్ల మేల్కొని పాత కాగితాలు వెతుకుతున్నారు. కానీ 1933 కంటె వెనక్కి పోయి రికార్డులు తీసుకురావాలంటే ఎవరి తరం? మొత్తంగా 1 ఆఫ్ 70 వ్యాజ్యాల విచారణ పద్ధతులనే మార్చి గిరిజనుల నిరక్షరాస్యతను లెక్కలోకి తీసుకునే కొత్త పద్ధతులు రూపొందించకపోతే '1 ఆఫ్ 70' విచారణలు గిరిజనేతరులకే అనుకూలంగా ముగిసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. 'చట్టం' అందరికీ సమాన రక్షణ కల్పించాలి' అని చెప్పే రాజ్యాంగ ప్రాథమిక హక్కయిన ఆర్టికల్ 14 నిజంగా అమలు కావాలంటే '1 ఆఫ్ 70' విచారణ పద్ధతులను సాధారణ సివిల్ సూట్ల కంటె భిన్నంగా రూపొందించాలి.

ఇదేదీ జరగకపోగా 1903 సెటిల్‌మెంట్ రికార్డు ఆధారంగా పండువారి గూడెం గిరిజనులు 495 ఎకరాలలో సాగు ఆపినందుకూ, అందులోని జీడి చెట్ల ఫలాన్ని పాడు చేసినందుకూ 80 మంది మీద క్రిమినల్ కేసు మాత్రం పెట్టారు.

అదే సమయంలో పండువారి గూడెంకు దగ్గరలో ఉన్న బరెంకలపాడు గిరిజనులు ఇంకొక భూమి వివాదం లేవదీసారు. తమ పెద్దల కాలంలో తాము సాగు చేసుకుంటున్న 500 ఎకరాల భూమినీ గడ్డ మడుగుల సోమరాజు అనే

1 ఆఫ్ 70 ప్రకారం 'బర్డెన్ ఆఫ్ ప్రూఫ్' గిరిజనేతరులపైన ఉంటుంది. కాబట్టి ఏజెన్సీ అధికారులు ఒక్కొక్క గిరిజనేతరుడికీ నోటీసు ఇచ్చి విచారణలు జరుపుతున్నారు, బాగానే ఉంది. కానీ అదే గ్రామంలో నివసించే గిరిజనులకు కూడ నోటీసు ఇచ్చి వారిని కూడా విచారణలో భాగం చేయరు (గిరిజనుల ఫిర్యాదు మీద చేపట్టిన కేసయితే తప్ప). అంటే వ్యాజ్యం మొత్తం ప్రభుత్వానికీ గిరిజనేతరులకూ మధ్య నడుస్తుంది. గిరిజనేతరులు చూపించే కాగితాల వెనకున్న వాస్తవాలేమిటో చెప్పగలిగింది స్థానిక గిరిజనులే. అయినా వారికి విచారణలో చోటు లేదు. ఒకవేళచోటు కలిగించినా, వారి మౌఖిక సాక్ష్యానికి అస్పష్టమైన జ్ఞాపకాలకూ ఏజెన్సీ కోర్టుల దృష్టిలో విలువ లేదు.

రాజుల కులస్తుడు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని వాళ్ల ఆరోపణ. అతను ఆ 500 ఎకరాలలో 200 ఎకరాలు ఇందిరాకాలనీకి చెందిన గిరిజనులకే పంచి పెట్టి మిగిలినది కొంత గిరిజనేతరులకు అమ్మి, కొంత తన స్వాధీనంలో ఉంచుకొని అనుభవిస్తున్నాడని అంటున్నారు. ఆ భూమిలో ఈ సంవత్సరం పంట వేయకుండ, తోటలలో కాసిన జీడి పిక్కలు కోయకుండ నాలుగు గూడాలకు చెందిన గిరిజనులు (బరెంకలపాడు కాలనీ, చంకవారి గూడెం, కొండువారి గూడెం, దాట్లవారి గూడెం) అడ్డం పోయారని 57 మందిపైన క్రిమనల్ కేసు నమోదయింది. పైగా వాళ్లను అరెస్టు చేయడానికి జీలుగుమిల్లి పోలీసులు చాలనట్టు దూర ప్రాంతాలయిన భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం ఎస్ ఐ లు, సిబ్బంది బయలు దేరి వచ్చారు. పోలీస్ అధికార్లంతా ఒక రాత్రి గిరిజన గూడాలపైన దాడి చేసి ముద్దాయిలను చీకట్లో అరెస్టు చేసి కొవ్వూరుకు తీసుకుపోయి పొద్దున్న ఆర్ డి వో ఎదుట హాజరు పరచారు. అయితే కాయకష్టం చేసుకొని బ్రతికే గిరిజనులను బందిపోట్లయినట్లు అర్ధరాత్రి అరెస్టు చేసి తీసుకురావలసిన అవసరం ఏముండిందని ఆర్ డి వో వాళ్ళను తిట్టింది.

గిరిజనుల భూమి దాహం చూసిన రెవెన్యూ అధికారులు వాళ్లను శాంతింప చేయడానికి ఒక ఆలోచన చేసారు. గిరిజనేతరుల పట్టా భూములపైన '1 ఆఫ్ 70' విచారణ జరిపి వాటిని విజయవంతంగా స్వాధీనం చేసుకొని గిరిజనులకు ఇప్పించడం సులభంగా అయ్యే పని కాదు కాబట్టి, అడవిలోని పోరంబోకు భూముల చిట్టాబయటకు తీసి, వాటిని గిరిజనేతరులు ఆక్రమించుకొని ఉంటే వారిని తొలగించి ఆ భూమిని గిరిజనులకు ఇవ్వాలనేది ఆ ఆలోచన. ఒక్కొక్క గ్రామంలోనూ ఎం ఆర్ వో, అర్ డి వోలు బహిరంగ సమావేశాలు నిర్వహించి పోరంబోకుల వివరాలు చెప్పి వాటిని గిరిజనులకిస్తామని హామీ ఇవ్వసాగారు. ఈ ఆలోచన కొంతకాలానికి గిరిజనేతర రైతుల నాయకుల ఆమోదం కూడ పొందింది. 'మీరు పట్టా భూముల జోలికి రావద్దు. 1 ఆఫ్ 70 అంటూ గొడవ చేయవద్దు. పోరంబోకులు మాత్రం అందరమూ కలిసి వెలికి తీద్దాం. అవి మీరే తీసుకుందురుగాని' అని గిరిజనేతర రైతు నాయకులు విడిగా కూడ గిరిజనులతో అనసాగారు. పెద్ద రైతుల ఆక్రమణలో పోరంబోకులు లేవని కాదు. అయితే అవి పోయినా వాళ్లకు పెద్దగా నష్టం లేదు. దాని వల్ల పట్టా భూములను కాపాడుకోగలిగితే అదొక లెక్క కాదు. కానీ పోరంబోకుల ఆక్రమణ మీదనే బ్రతుకుతున్న చిన్న రైతులు చాలా మంది ఉన్నారు. వాళ్లను పోరంబోకుల నుండి తొలగించి ఆ భూములను గిరిజనులకు అప్పగిస్తే వాళ్లు తమ జీవనాధారాన్ని కోల్పోతారు. గిరిజనేతర పేదలకూ గిరి జనులకూ వైషమ్యాలు చెలరేగే ప్రమాదం ఉంటుంది. ప్రభుత్వ అధికారుల ఉద్దేశ్యం ఇది కాకపోవచ్చు. ఎట్లాగో ఒకలాగ గిరిజనులకు కొంత భూమి చూపించి వాళ్లను శాంతింప చేయడమే వారి ఉద్ద్యేశం కానచ్చు. అయితే జరిగింది మాత్రం ఇది. ఈ వైషమ్యాన్ని చక్కగా వాడుకుంటున్నది ఏజెన్సీలో పుష్కలంగా భూమి వున్న గిరిజనేతర భూస్వాములు. వాళ్లు గిరిజనేతర చిన్న రైతుల్ని తమ పంచన చేర్చుకొని, బాగా రెచ్చగొట్టి, 'పాపం, చిన్న రైతులను కూడ బ్రతకనివ్వరా? గిరిజనేతరుడు కావడమే పాపమా?' అంటూ ఆవేశంతో ఊగిపోతున్నారు. ఈ ఆవేశమే ఏజెన్సీకి దూరంగా ఉన్న మైదాన ప్రాంతాలలో కూడ వినిపిస్తున్నది.

పందువారి గూడెం, బరెంకల పాడు గిరిజన ఆందోళనల ఫలితంగా రెవెన్యూ అధికారులు పోరంబోకుల అన్వేషణ మొదలు పెట్టారు. దర్భగూడెం దగ్గర ఉన్న లక్ష్మీపురం అనే గ్రామంలోని 25 ఎకరాల పోరంబోకు భూమి వారి కళ్లపడింది. పందువారి గూడెం, బరెంకల పాడులలో గిరిజనులు వివాదం లేవదీసింది మొత్తం 995 ఎకరాల గురించి. దానిని చల్లార్చడానికి ప్రభుత్వానికి దొరికింది 25 ఎకరాల పోరంబోకు భూమి! అది కూడ 20 మంది దళితుల ఆక్రమణలో ఉంది. పోనీ వాళ్లకు వేరే భూమి ఏమయినా ఉందా అంటే లేదు. ఈ భూమిని వాళ్లు దౌర్జన్యంగా, దొంగతనంగా ఆక్రమించుకున్నారా అంటే అదికూడ కాదు. ఏజెన్సీలో గిరిజనేతరుల మధ్య సహితం భూమి అమ్మకం చెల్లదని తెలియక డబ్బు పెట్టి కొనుక్కున్నారు. వాళ్లకు అమ్మిన దొంగలు ముగ్గురు కాపులు, ఒక కోమటి. అమ్మడమే కాదు, దర్జాగా రిజిస్టర్ కూడ చేసారు! '1 ఆఫ్ 70' అమలులోకి వచ్చిన తరువాత ఏజన్సీలో ఎటువంటి భూమిబదలాయింపును రిజిస్టర్ వేయడానికి వీలులేదని చట్టం (ఎ పి ఎస్ ఎ ఎల్ టి ఆర్ చట్టం, సెక్షన్ 3-బి) అంటుంది. అయినా రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. చేసిన వాళ్లు, చేయించిన వాళ్లు బాగానే ఉన్నారుగానీ ఎరుగక కొనుక్కున్న దళితులు ఇప్పుడు ఆ భూమిని కోల్పోయారు. పందువారి గూడెం, బరెంకలపాడులతో సహా మొత్తం 12 గూడాల గిరిజనులు ఆ 25 ఎకరాలను ఇప్పుడు దున్ని సాగు చేసుకుంటున్నారు. అదృష్టవశాత్తు ఇది దళితులకు, గిరిజనులకు మధ్య ద్వేషాన్ని కలిగించ లేదు. దళితులు తమకు జరిగిన అన్యాయానికి నిరసనగా జీలుగు మిల్లి ఎం ఆర్ వొ ఆఫీసుల ఎదుట టెంటు వేసారు గానీ గిరిజనులను నిందించడం లేదు. ఇరువర్గాలూ ఒకరు సమస్య నొకరు సానుభూతిగా అర్థం చేసుకుంటున్నారు.

నిజానికి లక్ష్మీపురం దళితుల సమస్యకు సులభమైన పరిష్కారమే ఉంది. దీనిని పౌర హక్కుల సంఘం జిల్లా కలెక్టర్ కు సూచించింది కూడ. లక్ష్మీపురం ఏజెన్సీ చివరన ఉన్న గ్రామం. అందులో ఈ 25 ఎకరాలు ఏజెన్సీ అంచున ఉన్నాయి. ఒక 100 గజాలు పోతే ఏజెన్సీయేతర గ్రామమైన ఎ. పోలవరం అనే ఊరు వస్తుంది. ఆ ఊరిలో పోరంబోకు భూమి ఉంది. అది ఈ 25 ఎకరాలను ఆనుకునే ఉంది. అందులో 25 ఎకరాలు ప్రభుత్వం లక్ష్మీపురం దళితులకు ఇచ్చి వారికి జరిగిన అన్యాయాన్ని సవరించవచ్చును.

జీలుగుమిల్లి నుండి బుట్టాయ గూడెం మండలానికి పోదాం. బుట్టాయగూడెం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బూసరాజుపల్లి ఈ మధ్య వార్తల కెక్కింది. గిరిజనేతరులపైన దాడి చేసిన నేరానికి ఈ ఊరికి చెందిన 115 మంది గిరిజన స్త్రీ పురుషులు అరెస్టయ్యారు. అందులో 43 మంది చాలాకాలం జైలులో ఉన్నారు. ఈ ఊరికీ బుట్టాయగూడెంకూ చెందిన గిరిజనేతర పెద్ద, చిన్న రైతులకు ఈ ఊరిలో భూములున్నాయి. ఈ గిరిజనేతరుల నాయకుడు బుట్టాయ గూడెంలో నివసించే కాపుకులస్తుడయిన కరాటం రాంబాబు అనే భూస్వామి. అతని తండ్రి ఒకప్పుడు బుట్టాయగూడెం మునసబు. ప్రస్తుతం అయిదుగురు అన్నదమ్ములకు చెరి 40 ఎకరాలు (సరిగ్గా సీలింగ్ పరిమితి) చొప్పున మొత్తం 200 ఎకరాల భూమి ఉందని అతనే అంటాడు.

బూసరాజుపల్లిలో గిరిజనేతరులు సాగుచేసుకుంటున్న భూమిలో ఏది 1 ఆఫ్ 70 ప్రకారం చెల్లుతుందో ఏది చెల్లదో తేల్చాలనీ, అది తేలేంత వరకు బూసరాజు పల్లిలో గిరిజనేతరుల వ్యవసాయం (మొత్తం 200 ఎకరాలు) ఆపాలనీ ఈ సంవత్సరం గిరిజనులు (కోయలు) అడ్డం పడ్డారు.

రెవెన్యూ అధికారులు వచ్చి బూసరాజు పల్లిలోని సాగుభూమిలో దేని పైన ఎవరికి హక్కుందో రికార్డు చదివి ప్రకటించారు. అందులో దళితులు సాగు చేసుకుంటున్న 30 లేక 35 ఎకరాలు వారిది కాదనీ, 1933 ఆర్.ఎస్.ఆర్ లో అది అంతా గిరిజనుల పేరు మీద ఉంది కాబట్టి ఆ తరువాత వేరే ఎవరు దానిని స్వాధీనం చేసుకున్నా అది చెల్లదనీ రెవెన్యూ అధికారులు అన్నారు. గిరిజనుల జ్ఞాపకాల ప్రకారం ఆ భూమి వారి స్వాధీనంలోనే ఉండేది. అయితే 1967లో కరణం, మునసబులు పోలీసులతో వచ్చి గిరిజనులను వెళ్లిపొమ్మని చెప్పి బుట్టాయగూడెంకు చెందిన దళితులకు దానిని అప్పగించారు. వారిలో 20 మందికి డిఫారం పట్టాలు సహితం కరణం ఇచ్చాడు. ఇవేవీ చెల్లవని ఈ వేసవిలో రెవెన్యూ అధికారులు ప్రకటించగా, బూసరాజుపల్లిలోని గిరిజనేతరుల సాగుమొత్తం బంద్ పెట్టించిన గిరిజనులు, దళితులు ఖాళీ చేసిన ఈ 30 లేక 35 ఎకరాలను మాత్రం తామే దున్నుకొని నాట్లు వేసారు. దీనితో ఆగ్రహించిన దళితులు ఆందోళన చేపట్టారు. '1 ఆఫ్ 70' లో దళితులకు మినహాయింపు ఇవ్వాలని ఒక డిమాండు, ఏజెన్సీలో ఉన్న దళితులను కొండమాలలు, కొండ మాదిగలుగా అంటే గిరిజనులుగా గుర్తించాలని ఒక డిమాండు ముందు కొచ్చాయి. గిరిజనేతర రైతుల నాయకులకు ఇది మంచి అదనుగా కనిపించింది. గిరిజనులు దున్నుకున్న దళితుల భూమిలో సాగును బలప్రయోగంతో ఆపితే, అదే ఊపులో గిరిజనులు మొత్తంగా అటకాయించిన గిరిజనేతరుల సాగును పునరుద్ధరించవచ్చునని ఆశించారు. లేదా కనీసం గిరిజనులకు 'బుద్ధి చెప్పవచ్చునని' ఆశించారు.

దళితుల భూమిలో గిరిజనులు వేసిన వరినాట్లు పీకేయడానికి ఆగస్ట్ 5వ తేదీ పొద్దున్న గిరిజనేతరులు బుట్టాయగూడెం నుండి స్కూటర్లలో, మోటార్ సైకిళ్లలో, ట్రాక్టర్లలో బూసరాజు పల్లికి బయలుదేరారు. ఈ గుంపులో దళితుల కంటే దళితేతరులే ఎక్కువ మంది ఉన్నారు. దీనికి నాయకత్వం వహించిన వాడు కరాటం రాంబాబు. జంగారెడ్డి గూడెంలో ఉన్న అతని సినిమా టాకీస్ వర్కర్లను కూడ తీసుకొచ్చాడు. బుట్టాయగూడెం మండలం నుండే కాక జీలుగుమిల్లి మండలం నుండి కూడ ఈ దాడిలో పాల్గొనడానికి గిరిజనేతరులు బయలుదేరి వచ్చారు. ఒక గ్రామాన్ని ఎంచుకొని పెద్ద ఎత్తున దాడి చేస్తే మూడు మండలాలలోనూ గిరిజనులు నోరెత్తకుండ ఉంటారని ఆశించి నట్టున్నారు. ఈ సంవత్సరం పశ్చిమగోదావరి ఏజెన్సీలో గిరిజనుల ఆందోళన మొదలయినప్పటి నుండి, మూడు ఏజెన్సీ మండలాల గిరిజనేతరులు ఏజెన్సీకి దగ్గరిలో ఉన్న పెద్ద ఊరయిన జంగారెడ్డి గూడెంలో కలుసుకొని మంతనాలాడుకుంటూనే ఉన్నారు. బూసరాజు పల్లి ఘటనకు పథకం ఆ మంతనాలలో రూపొందించుకొని ఉన్నా ఆశ్చర్యపోనవసరం లేదు.

నాట్లు పీకడానికి బయలుదేరిన గిరిజనేతరులు దాదాపు 300 మంది ఉన్నారు. గిరిజనులను భయపెట్టడానికి బొట్లు పేల్చుకుంటూ బూసరాజుపల్లివైపు పోయారు. నాట్లు వేసిన భూమిని పాడు చేయడమేకాక, పక్కన ఉన్న గిరిజనుల భూములలోని కూరగాయపాదులు ధ్వంసం చేసారు. నాలుగు అరటి చెట్లు ఒక మామిడి చెట్టు విరిచేసారు. అయితే గిరిజనేతరులు చేస్తున్న సన్నాహాల గురించి తెలిసిన వివిధ గూడాల గిరిజనులు కూడ దాదాపు 150 మంది ఆ రోజు పొద్దున్న బూసరాజు పల్లి చేరుకున్నారు. వాళ్ల దగ్గర వాళ్ల సంప్రదాయ ఆయుధాలయిన విల్లంబులున్నాయి. ఈ పరిస్థితి చూసి గిరిజనేతరులు కొంచెం వెనక్కి తగ్గగా, గిరిజనులు ప్రత్యర్థినాయకుడయిన కరాటం రాంబాబును పట్టుకొని తమ మధ్య కూర్చోబెట్టుకున్నారు. వాళ్లబందీగా రాంబాబు భూమి సమస్య గురించి వాళ్లతో చర్చ మొదలు పెట్టాడు. మధ్యాహ్నం 12.00 కు పోలీసులు కూడ వచ్చారు. అప్పటికప్పుడు కొవ్వూరు ఆర్‌డివోను పిలిపించి ఎవరి హక్కులేమిటో తేల్చుకుందామని ఇరుపక్షాలూ అనుకున్నారు. అయితే ఆర్‌డివోకు ఫోన్ చేయగా ఆమె ఆ ఘర్షణ వాతావరణంలో రావడం ఇష్టం లేక మరుసటి రోజు ఇద్దరినీ ఎంఆర్‌వో కార్యాలయానికే రమ్మనింది.

ఈ విధంగా సాయంత్రం అయింది. ఇంక ఇరు పక్షాలూ ఆ రోజుకు వెళ్లిపోయి మరుసటి రోజు ఆర్‌డివో దగ్గర హాజరు కావాలని నిర్ణయించు కున్నారు. గిరిజనులు తమకు సహజమైన నమ్మకంతో ముందు వెనక్కి తిరిగి వెళ్లి పోయారు. గిరిజనేతరులు ఆ తరువాత లేచి వెళ్లి పోతూ ఆకతాయిగా తొడలు చరిచి ఈలలు వేసారు. దానితో గిరిజనులు రెచ్చి పోయారో లేక దాడి జరగబోతుందని భయపడ్డారో తెలీదు గానీ, పోతున్న వాళ్లు వెనక్కి తిరిగి బాణాలు వేసి గిరిజనేతరులను తరిమారు. కర్రలతో కొట్టారు. ఈ దాడి కొద్ది నిముషాల సేపు మాత్రమే జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

మామూలుగా ఇటువంటి సంఘటన జరిగితే పోలీసులు ఇరు పక్షాల మీదా దొమ్మికేసు పెడతారు. కానీ బూసరాజు పల్లి ఘటనలో 115 మంది గిరిజనులపైన కేసు పెట్టారు తప్ప గిరిజనేతరులపైన కేసు పెట్టలేదు. అందులోనూ గిరిజనులపైన హత్యాప్రయత్నం (సెక్షన్ 307) కేసు పెట్టారు. వారిలో 43 మంది ఒకనెలపైగా బెయిలు రాకుండా రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉండి పోయారు.

ఇంక పోలవరం మండలానికి పోదాం. పోలవరం మండలంలోని దొండపూడి అనే గిరిజనేతర గ్రామానికి సమీపంలో మనుగోపాల, కుంకాల, పేద్రాల అనే గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలన్నీ ఒకప్పటి పిఠాపురం జమిందార్ ఎస్టేట్‌లోనివి. ఒకప్పటి వీటి యజమాని హోత శివరామ శాస్త్రి అనే బ్రాహ్మణుడు. ఎస్టేట్‌లు రద్దయి కౌలుదార్లకు సెటిల్‌మెంట్ ద్వారా పట్టాలు వచ్చాయి గానీ ఈ సెటిల్ మెంట్ పట్టాలు పొందిన రైతులలో ఎక్కువ భాగం శివరామశాస్త్రి బేనామీ లేనని గిరిజనుల అభిప్రాయం. అతనిని ఇప్పటికీ 'హుకుంపేట జమిందారు' అంటారు. కుంకాలలో 149 ఎకరాలు నేరుగా అతని పేరు మీదనే ఉన్నాయనీ, పాత జమిందారీ ఎస్టేట్‌లో మొత్తం 3000 ఎకరాలు బేనామీగా అతని ఆధీనంలోనే ఉన్నాయనీ గిరిజనులు అంటారు. ఇది కాక పై మూడు గిరిజన గూడాలలోనూ రెడ్డినాగంపాలెం అనే మరొక గిరిజన గూడెంలోనూ 1925-30 దాకా గిరిజనుల సాగులో ఉన్న భూములను 1933 సెటిల్‌మెంట్‌లో సాగుభూమిగా కాక రెవెన్యూ పోరంబోకు (అసెస్డ్ వేస్ట్ డ్రై) భూమిగా రాయించి గిరిజనేతరులకు పట్టాచేయించారని కూడ గిరిజనుల ఆరోపణ. దీని పైన గిరిజనులుప్రస్తుతం హైకోర్టులో కేసువేసి ఉన్నారు. ఈ వివాదంలో భాగంగా గిరిజనులు ఈ సంవత్సరం మనుగోపాల, కుంకాల, పేద్రాల, రెడ్డి నాగం పాలెంలలో మొత్తం 700 ఎకరాలలో గిరిజనేతరుల సాగును అటకాయించారు. వివాదం తేలేంత వరకు సాగు వేయొద్దన్నారు. గిరిజనేతరులు దొండపూడిని కేంద్రం చేసుకొని దాడికి సిద్ధం అయ్యారు. మార్చి 20 నాడు ట్రాక్టర్లు, జీపులలో కుంకాలపైన దాడిచేసి బాంబులతో

బెదిరించారు. కొందరు స్త్రీలను కొట్టారు. తరువాత కర్రలు చేతబట్టుకొని పేడ్రాలలో 'ఫ్లాగ్ మార్చ్' చేసారు. మరుసటి రోజు మనుగోపాల పైన దాడి చేసి ఇళ్లలో కుండలు పగలగొట్టారు. తలుపులు విరగొట్టారు. ధ్యానం, కుంకుడు కాయల బస్తాలు దోచుకున్నారు. మొత్తం అయిదిళ్లపైన దాడి చేసారు. కారం పెంటమ్మ అనే స్త్రీ చేయి విరగొట్టారు. కట్టం రాజమ్మను కొట్టి ఆమె ఇంట్లో అన్నంలో ఇసుక కలిపి తొక్కారు. సున్నం వెంకట లక్ష్మి యింట్లో కొంత బంగారం, 4000 రూపాయల నగదు తీసుకు పోయారు. పొద్దున్న 11 నుండి ఒంటిగంట దాకా ఈ స్వైర విహారం సాగింది.

మనుగోపాలలో 'శక్తి' అనే స్వచ్ఛంద సంస్థ కార్యకర్త అయిన కారం వెంకటేశ్వరరావు అనే గిరిజనుడు ఉంటాడు. ఆ సమయంలో అతను కుంకాలలో ఉన్నాడు. దాడి జరుగుతుండగా అతను వెనక్కి వచ్చాడు. గిరిజనేతరులు అతను రావడం గమనించి రాళ్లతో కర్రలతో ఎదురుపోయి అతను పారిపోతే వెంటబడి తరిమి పట్టుకున్నారు. అతని బావమరిది

> *ఏజెన్సీ భూమి వివాదాలను విచారించే పద్ధతులు గురించి పునరాలోచించవలసిన అవసరం ఉంది. గ్రామాలలో నేలోక్ అదాలత్ల పద్ధతిలో విచారణలు నిర్వహించి, మౌఖిక సాక్ష్యానికి కూడా చోటు కల్పించి ఒక్కొక్క గ్రామంలోనూ భూమి బదలాయింపు జరిగినవైనం వెలికి తీయాలి. అప్పుడు తప్ప '1 ఆఫ్ 70' విచారణలలో పూర్తి న్యాయం జరగదు.*

మిడియం కోశీరావును కూడ పట్టుకొని ఇద్దరినీ విపరీతంగా కొట్టి, బ్లేడ్లతో కత్తులతో కోసి, రాడ్లతో పొడిచి, ఒక ట్రాక్టర్లో వేసి సవాల్ చేస్తూ ఊరంతా విహరించారు. బాంబులు వేసారు. ఆ తరువాత వాళ్లను దొండపూడికి తీసుకు పోయి కొంత సేపు ఒక రైతు ఇంట్లోనూ కొంతసేపు ఒక మామిడి తోటలోనూ ఉంచి మరుసటి రోజు వాళ్లచేత ఒక తెల్ల కాగితం మీద సంతకం చేయించుకోవడానికి విఫల యత్నం చేసి చివరికి విడిచి పెట్టారు. బూసరాజు పల్లిలో గిరిజనులు చేసిన దాడి ఒక పెద్ద సంఘటనగా ప్రచారం అయింది గానీ మనుగోపాలలో గిరిజనేతరులు అంతకంటె చాలా క్రూరంగా చేసిన ఈ దాడి గురించి ప్రచారమే జరుగలేదు.

700 ఎకరాలలో గిరిజనేతరుల వ్యవసాయాన్ని అటకాయించినందుకు 38 మంది గిరిజనులపైన క్రిమినల్ కేసులయ్యాయి. వాళ్లు అరెస్టయ్యారు. అందులో రెడ్డినాగం పాలెంలో వున్న భూమినయితే గిరిజనులు ఆక్రమించుకొని సాగు చేసేస్తున్నారు. ఈ ఊరిలో కొండరెడ్ల సాగులో ఉన్న భూమిని 1933 సెటిల్‌మెంట్‌లో రెవెన్యూ పోరంబోకుగా రాయించి గిరిజనేతరులు స్వంతం చేసుకున్నారని గిరిజనుల ఆరోపణ. దానిపైన వాళ్లు హైకోర్టులో వేసిన కేసు విచారణలో ఉంది.

**ముగింపు :**

ఇది, క్లుప్తంగా పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజన గిరిజనేతర రైతుల ఘర్షణల కథ.

• గిరిజనేతరులలో చిన్న రైతులు లేరా, వాళ్ల పంగతేమిటి అని ఆవేశ పడే ముందు గిరిజనుల సమస్యలను స్పష్టంగా అర్థం చేసుకోవడం అవసరం. అడవిలో బ్రతికే గిరిజనులకు అడవి తప్ప వేరే ఆధారం లేదు. అడవి భూములు, అటవీ సంపద వారి జీవనాధారం. అడవుల వ్యాపారీకరణ ఫలితంగా అటవీ సంపద మీద గిరిజనులు తమ హక్కును క్రమంగా కోల్పోతున్నారు. అటవీ సంపదలో కొంత భాగం గిరిజనులకు పూర్తిగా నిషిద్ధం అయింది. ఇంకొంత భాగం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆస్తి, లేకపోతే గిరిజన కార్పొరేషన్ ఆస్తి అయింది. ఆదివాసీలు, ఆ ప్రభుత్వ శాఖల లేక సంస్థల కూలీలయ్యారు. అంతకంటె ముందునుండి అడవి భూమి పరాయీకృతం అవుతున్నది. 1917 లోనే పరాయీకరణను నియంత్రించడానికి బ్రిటిష్ వాళ్లు చట్టం చేసినా 70 సంవత్సరాల తరువాత పరాయీకరణ పెద్ద మొత్తంలో కనిపిస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఏజెన్సీలో సగం కంటె ఎక్కువ భూమి గిరిజనేతరుల చేతిలో ఉంది. బుట్టాయ గూడెం మండలాన్ని ఒక ఉదాహరణగా తీసుకుంటే ఆ మండలంలోని భూమి యజమాన్యం లెక్కలు ఈ విధంగా ఉన్నాయి.

| | ఎకరాలు |
|---|---|
| మొత్తం సాగు భూమి | 52,700 |
| గిరిజనులది | 22,400 |
| గిరిజనేతరులది | 22,000 |
| కోర్టు కేసుల్లో ఇరుకున్నది | *2,300 |
| పోరంబోకులు ( అసెస్డ్ వేస్ట్) | 6,000 |

(* కోర్టు కేసుల్లో ఉన్నదంతా గిరిజనేతరుల అధీనంలో ఉన్న భూమే)

'1 ఆఫ్ 70' బలమైన చట్టమేగానీ దాని క్రింద జరిగే విచారణలు దస్తావేజులను ప్రధాన ప్రమాణంగా తీసుకోవడం వల్ల అది గిరిజనులకు ఎక్కువ మేలు చేయలేకపోయింది. '1 ఆఫ్ 70' కేసుల ద్వారా యాజమాన్య నిర్ధారణ జరిగిన సాగుభూమిలో 54 శాతం గిరిజనేతరులకు దక్కిందనీ 46 శాతం మాత్రం గిరిజనులకు దక్కిందని పైన చూసాము. గిరిజనులే ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసి ఉంటే తప్ప '1 ఆఫ్ 70' విచారణలలో గిరిజనులను 'పార్టీ' చేయడం లేదనీ, ఆ విచారణలు ప్రభుత్వానికీ గిరిజనేతర రైతుకూ మధ్య వ్యాజ్యంగా సాగుతున్నాయనీ చెప్పాము. గిరిజనేతర రైతు విచారణాధికారిని సంతృప్తి పరచే దస్తావేజులు చూపిస్తే చాలు. ఒక వేళ అందుకు భిన్నమైన సమాచారం అదే గ్రామానికి చెందిన గిరిజనుల దగ్గర ఉన్నా అది విచారణాధికారి పరిశీలనలోకి రాదు. ఒక వేళ వచ్చినా దానికి ఆధారంగా కాగితాలేవీ చూపించ లేకపోతే వారి లెక్కలోకి రాదు. బూసరాజు పల్లి గురించే గిరిజనులొక కథ చెప్తారు. ఆ ఊరికి మైదాన ప్రాంతాల నుండి కమ్మ, కాపు రైతులు రావడం మొదలు పెట్టిన దశలో పెద చిన్నమ్మ అనే కోయ స్త్రీ గట్టిగా ఎదుర్కొనిందంట. తన వాళ్లనే జీతగాళ్లగా పెట్టుకొని పెద్ద మొత్తంలో వ్యవసాయం చేసేదంట. అయితే ఆమెను కుటుంబ కలహాలలో భాగంగా ఆమె అల్లుడే పొడిచి చంపాడట. తదుపరి మైదాన ప్రాంతాల వాళ్లు వేగంగా ఆ ఊరి భూమిని ఆక్రమించుకున్నారంట. ఇది ఎప్పుడు జరిగిందంటే వాళ్లు చెప్పలేరు. బ్రిటిష్ కాలంలోనా ఆ తరువాతనా అంటే చెప్పలేరు. ఈ కథను ఏజెన్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులో

*(మిగతా 23వ పేజీలో)*

సత్తయ్యను కాల్చి చంపారు. సత్తయ్య మున్నూరు కాపు కులానికి చెందిన చితికి పోయిన రైతు. ఆ రోజు బొంపెల్లి గుట్టలలో నక్సలైట్లు కలప స్మగ్లింగ్ గురించి మాట్లాడడానికి సమావేశం నిర్వహించారు. బొంపెల్లి సర్పంచ్‌తో సహా 10 మంది ఆ ఊరి రైతులు వెళ్లారు. వారిలో సత్తయ్య ఒకడు. ఇతర గ్రామాల రైతులు కూడ హాజరు అయ్యారు. పోలీసులకు సమాచారం అంది అటువైపు వచ్చారు. వాళ్లు అకస్మాత్తుగా సమావేశ స్థలాన్ని చేరుకునే సరికి ఇరు పక్షాలూ గాభరాపడ్డారు. సత్తయ్య సడన్ గా లేచి పరుగెత్తే సరికి పోలీసులు అతనిని కాల్చి చంపారు. నక్సలైట్లు కాల్పులు జరుపుతూ వెనక్కి పోయేసరికి మిగిలిన రైతులు వాళ్లతో పాటు తప్పించుకున్నారు.

ఆగస్ట్ 2 తెల్లవారు జామున పోలీసులు వరంగల్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న దేశాయి పేట సమీపంలో **ముత్యాల మొగిలి** అనే దళిత యువకుడిని కాల్చి చంపారు. సంగెం మండలం తీగరాజు పల్లికి చెందిన చిన్న రైతు కొడుకయిన మొగిలినీ అతని మిత్రుడు అప్పారావునూ పోలీసులు ఆగస్ట్ 1వ తేదీన వరంగల్ పట్టణంలోని రామలక్ష్మణ టాకీసులో మ్యాట్నీ చూసి బయటకు వస్తుండగా అరెస్టు చేసారు. మరుసటి రోజు పొద్దున్నే దేశాయి పేట దగ్గర మొగిలిని కాల్చి చంపారు.

ఆగస్ట్ 3 తెల్లవారు జామున పోలీసులు వరంగల్ పట్టణంలోని హంటర్ రోడ్డుపైన (శాయంపేట క్రాస్‌రోడ్స్ దగ్గర) **మద్దెల తిరుపతి** అనే యువకుడిని కాల్చి చంపారు. అతను రేగొండ మండలం లింగాల గ్రామానికి చెందిన దళిత యువకుడు. వరంగల్‌లోనే ప్లంబర్ పని చేసుకుంటూ లాల్‌బహదూర్ కాలేజిలో ఇంటర్ చదువుతూ ఉండేవాడు. ఆగస్ట్ 2వ తేదీ పొద్దున్న పోలీసులు అతనిని వరంగల్ పట్టణంలోని పోచమ్మ మైదానం ప్రాంతంలోని అతని రూం బయట అరెస్టు చేసి 3వ తేదీ పొద్దున్న హంటర్ రోడ్ మీద కాల్చి చంపారు.

ఆగస్ట్ 13 తెల్లవారు జామున పోలీసులు వరంగల్ జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామం శివారులో జంగపల్లి చంద్రం అనే నక్సలైట్ కార్యకర్తనూ **బద్రి జోజిరెడ్డి** అనే రైతునూ కాల్చి చంపారు. గుర్జకుంట గ్రామనివాసి అయిన జోజిరెడ్డికి తన తండ్రితో పొలంగట్టు తగాదా ఉండింది. ఈ తగాదాను పరిష్కరించడం కోసం చేర్యాల పోలీస్ స్టేషన్‌లోనే ఒక సంవత్సరం క్రితం పంచాయితీ జరిగింది. ఆ పరిష్కారంతో సమస్య శాంతించ లేదు. జోజిరెడ్డి ఒకవైపు నక్సలైట్లను ఆశ్రయించాడు. మరొకవైపు తండ్రితో ఘర్షణ కొనసాగించాడు. ఆగస్ట్ నెలలో ఒక రోజు ఈ ఘర్షణలో భాగంగా అతను తండ్రిని కొట్టాడు. తండ్రి చేర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేసాడు. జోజిరెడ్డికి నక్సలైట్లతో ఉన్న సంబంధాల గురించి తెలిసిన పోలీసులు ఇదే అదననుకున్నారు. 12 రాత్రి స్పెషల్ ఎస్ఐ సర్వర్ నాయకత్వంలో పోలీసులు నక్సలైట్ల వేషంలో గుర్జకుంటలోని జోజిరెడ్డి ఇంటికి పోయారు. ఇటువంటిదేదో జరుగుతుందన్న అనుమానంతో అతను తన ఇంట్లోకాక కాశెట్టి లక్ష్మయ్య అనే రైతు ఇంట్లో పండుకున్నాడు. పోలీసులు అతను అక్కడ ఉన్నాడని తెలుసుకొని అక్కడికి పోయి అతనిని లేపి తీసుకొని పోయి చంపుతామని బెదిరించగా, జంగపల్లి చంద్రం దొమ్మాట శివారులోని వంకాయల సాయిలు ఇంట్లో ఉంటాడని చెప్పాడు. ఆ యింటికి 100 గజాల దూరంలోనే ఇద్దరినీ కాల్చి చంపారు.

ఆగస్ట్ 13 మధ్యాహ్నం 12-45 సమయానికి పోలీసులు ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల మండలం సిసిసి పోలీస్ స్టేషన్ పరిధి (నస్పూర్) లో **జక్కిరబోయిన శివకుమార్** అనే శివసేన కార్యకర్తను కాల్చి చంపారు. ఇదొక భస్మాసుర గాథ. శివకుమార్ ఒక గని కార్మికుడి కొడుకు. పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించేవాడు. (ఈ సంగతి జిల్లా ఎస్‌పి స్వయంగా ఒప్పుకున్నాడు). ఒక లైసెన్స్ లేని రివాల్వర్ పెట్టుకొని ఒక వైపు సికాస సానుభూతి పరులను బెదిరిస్తూ, మరొకవైపు రౌడీ మామూళ్లు వసూలు చేసుకుంటూ బతికేవాడు. మంచిర్యాలలో ప్రజలకు ఒక టెర్రర్‌గా

# పశ్చిమగోదావరి జిల్లాలో '1 ఆఫ్ 70' సమస్య

*(8వ పేజీ తరువాయి)*

రుజువు చేయడానికి కావలసిన డాక్యుమెంట్లు గిరిజనుల దగ్గర లేవు. అవి ఒక వేళ ఉనికిలో ఉన్నా ఆ సంగతి గిరిజనులకు తెలీదు. తెలిసినా ఆ కాగితాలను సంపాదించడం వాళ్లకు సులభం కాదు. ఉదాహరణకు రెడ్డి నాగంపాలెంకు చెందిన గిరిజనులు తమ కేసుకు అవసరమైన డాక్యుమెంట్లు ఇమ్మని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అడిగితే వాళ్లు 10 వేల రూపాయల లంచం అడిగారంట. గిరిజనులు కష్టపడి లంచం సేకరించి ఇచ్చినా కాగితాలు సకాలంలో ముట్టలేదంట.

భూములకు సంబంధించి కరణాలు, మునసబులు ఏది తలచుకుంటే అది రికార్డుకెక్కింది. అదే సత్యం అయింది. వాళ్లు గిరిజనులు సాగుచేస్తున్న దానిని గిరిజనేతరుల పేరిట రాసారో, పోరంబోకులన్నారో తెలీదు. దురాక్రమణను అమ్మకంగా గుర్తించారేమో తెలీదు. ఇప్పుడు ఆ రికార్డులలో తమ హక్కులు వెతుక్కోమనడం గిరిజనులకు శాపమే.

కాబట్టి ఏజెన్సీ భూమి వివాదాలను విచారించే పద్ధతుల గురించి పునరాలోచించవలసిన అవసరం ఉంది. గ్రామాలలోనే లోక్ అదాలత్‌ల పద్ధతిలో విచారణలు నిర్వహించి, మౌఖిక సాక్ష్యానికి కూడా చోటు కల్పించి ఒక్కొక్క గ్రామంలోనూ భూమి బదలాయింపు జరిగిన వైనం వెలికి తీయాలి. అప్పుడు తప్ప '1 ఆఫ్ 70' విచారణలలో పూర్తి న్యాయం జరగదు.

రెండవది, ఏజెన్సీలో సీలింగ్ పరిమితి ఎంత ఉండాలనే సమస్య. ప్రస్తుతం ఉన్న 40 ఎకరాలు మరీ ఎక్కువ. అది సాగునీటి సరఫరా లేని భూమే కావచ్చును గానీ చాలా సారవంతమైన భూమి, చాలా విలువయిన భూమి కాబట్టి సీలింగును 15 ఎకరాలకు తగ్గించి మిగులు భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. ఈ రెండు పనులూ చేస్తే పెద్ద మొత్తంలో భూమి ప్రభుత్వం చేతిలోకి వస్తుంది. అందులో ఆదివాసీల జీనన అవసరాలకు పోను మిగిలిన భూమిని గిరిజనేతర పేద రైతులకు (దళితులతో మొదలు పెట్టి) పట్టా చేయవచ్చును. అంతే తప్ప గిరిజనేతర పేదల సమస్యలను ప్రధానం చేసి '1 ఆఫ్ 70' కి లొసుగులు పెట్టడం సరయిన ప్రతిపాదన కాదు. ఎంత పేద వారయినా గిరిజనేతరులకు ఏజెన్సీ బయట బ్రతుకు తెరువు దొరికే అవకాశం ఉంది. ఆదివాసీలకది లేదు.